సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 3 । మార్చి । 2023



ఘనంగా పోచమ్మ బోనాలు

బోయినపల్లి(చొప్పదండి): తడగొండ కుర్మ సంఘం ఆధ్వర్యంలో గురువారం బీరప్ప పట్నాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు పోచమ్మకు బోనాలు తీశారు.



రెండోరోజు పవిత్రోత్సవాలు

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో రెండోరోజు పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి హోమం నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
35.0/19.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రోజంతా ఉక్కపోతగా ఉంటుంది. తెల్లవారు జామున ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

దివ్యాంగుడికి చేరిన ఆటో



దివ్యాంగుడు నర్సయ్యకు ఆటో అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దివ్యాంగుడి వేదనకు మంత్రి కేటీఆర్ స్పందించారు. బతుకు దెరువు కోసం ఆటోను అందించారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన దివ్యాంగుడు ఆకారం నర్సయ్య భార్య లేదు. ఇద్దరు కూతుళ్లు మాధురి, గౌతమిలను అద్దె ఆటో నడుపుతూ సాదుకుంటున్నాడు. ఎల్లారెడ్డిపేటకు మంగళవారం వచ్చిన మంత్రి కేటీఆర్‌ను కలిసి తన బతుకుదెరువుకు ఆటో ఇప్పించాలని విన్నవించాడు. నర్సయ్య పరిస్థితి తెలుసుకొని చలించిన మంత్రి కేటీఆర్ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆటో ఇప్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో గురువారం ఆటోను నర్సయ్యకు అందించారు. ఆటోను అందుకున్న నర్సయ్య మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ సుల్తానా, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి ఉన్నారు.

డీఈవో రమేశ్‌కు సన్మానం



డీఈవో రమేశ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా విధుల్లో చేరిన రమేశ్‌కుమార్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం సన్మానించారు. విధుల్లో చేరిన తర్వాత మర్యాదపూర్వకంగా తొలిసారి కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్యాంసుందర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పరుశురాములు, రాజు, సంధ్యారాణి, సంయుక్త కార్యదర్శి నరేశ్ ఉన్నారు. బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు పులి రామ్‌గోపాల్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల సుధాకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తాటికొండ కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రత్యేక తరగతుల పరిశీలన

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో పదోతరగతి ప్రత్యేక తరగతుల తీరు, ఇటీవల విద్యార్థులకు కేటాయించిన ఇంటర్నల్ మార్కులను పరిశీలించేందుకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి గురువారం ప్రత్యేక అధికారులు వచ్చారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ పాఠశాలలో తరగతుల నిర్వహణ తీరును రాష్ట్ర పర్యవేక్షకుడు రమేశ్‌రావు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో బోర్డుపై రాయించి వారిలోని నైపుణ్యతను పరీక్షించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యవేక్షణ కమిటీ సభ్యుడు, హెచ్‌ఎం చకినాల శ్రీనివాస్, వినయధర్ రాజు, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

6న 'డబుల్' ఇళ్ల ఎంపిక

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని పదోవార్డు చిన్నబోనాలలో ఈనెల 6న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వార్డుసభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆ వార్డులోని అర్హులైన లబ్ధిదారులు సమయానికి హాజరుకావాలని కోరారు.

కంటి వెలుగులో 3,712 మందికి పరీక్షలు



సిరిసిల్లలో కంటి వెలుగు పరీక్షలు (ఫైల్)

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో కంటి వెలుగు-2లో గురువారం 3,712 మందికి కంటి పరీక్షలు చేశారు. జిల్లాలోని 25 ప్రాంతాల్లో కంటివెలుగు పరీక్షలు చేసి 552 మందికి రీడింగ్ అద్దాలు, 422 మందికి పాయింట్ అద్దాలను అందించారు. జిల్లా వ్యాప్తంగా 30 రోజులుగా కంటివెలుగులో 1,15,631 మందికి పరీక్షలు చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 20,069 మందికి రీడింగ్ అద్దాలు, 14,792 మందికి పాయింట్ అద్దాలను అందించారు. 225 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.

పత్తాలేని 'గిరి'వికాసం



తండాల్లో బీడుగా గిరిజనుల భూములు

- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- జిల్లాకు రూ.63 లక్షల కేటాయింపు
- ఒకే ఒక్క యూనిట్ మంజూరు
- బీడుగానే గిరిజనుల భూములు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి గిరివికాసం (సీఎం జీవీ) పథకం గిరిజన రైతులకు అందడం లేదు. ప్రభుత్వం ఇంద్రజల పథకం కింద ఉన్నదాన్ని 2018 మే నెలలో గిరివికాస పథకంగా మార్పుచేసింది. జిల్లాలోని 263 గిరిజన తండాలు, 255 గ్రామ పంచాయతీలలోని వెనుకబడిన గిరిజనుల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఉచితంగా బోరుమోటార్లు అందించి బీడు భూములను సాగులోకి తేవడమే లక్ష్యం. అర్హులైన గిరిజన రైతులకు అందించడమే లక్ష్యంగా అధికారులు పంట పొలాల్లోకి వెళ్లి సర్వే చేశారు. జిల్లాకు మొదటి విడతలో రూ.63లక్షలు కేటాయించారు. అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోలేకపోయారు.

సర్వేలకే పరిమితం..

జిల్లాలోని గిరివికాస పథకం అమలుకు గిరిజనులు ఎక్కువగా ఉన్న వీర్నపల్లి మండలాన్ని అధికారులు ఎంచుకున్నారు. ఆ దిశగా వీర్నపల్లి, భూక్యతండా, బాబాయ్‌చెరువు తండా, రాశిగుట్టతండా పరిధిలోని గిరిజనుల భూములను అప్పట్లో డీఆర్డీవో మదన్‌మోహన్ ఆధ్వర్యంలో సంక్షేమ శాఖ అధికారులు సర్వే చేశారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా సాగు చేసుకోలేకపోతున్న నిరుపేద గిరిజనులను గుర్తించాలి. కానీ ఈమేరకు జిల్లాలో ఎక్కడ ప్రయత్నాలు జరుగలేవు. అంతేకాకుండా వారికి గ్రామాలవారీగా అవగాహన కల్పించి పథకం తీరుతెన్నులు చెప్పలేకపోయారు.

జిల్లాకు ఒకే ఒక్క యూనిట్

- రాజన్నసిరిసిల్ల జిల్లాకు ఇప్పటి వరకు ఒకే ఒక్క యూనిట్ కేటాయించి అధికారులు చేతులు దులుపుకున్నారు. పథకం 2018లో ప్రారంభంకాగా.. ఇప్పటి వరకు జిల్లాలోని 25 ఎకరాలకు సంబంధించి ఐదుగురు రైతులకు ఒక యూనిట్‌గా బోరుమోటార్లు మంజూరు చేశారు. ఈ పథకానికి అర్హులైన రైతులు సిరిసిల్లలోని డీఆర్డీఏ, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఐదుగురు రైతులు ఒక యూనిట్‌గా ఏర్పడి ఒక్కొక్కరికి ఐదు ఎకరాల చొప్పున 25 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు ఆధార్‌కార్డు, కుల, నివాసవ, ఆదాయపత్రాలను జత చేయాల్సి ఉంటుంది. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బోర్లు వేయిస్తారు. గత ఐదేళ్లుగా ఈ పథకంపై అధికారులు అవగాహన కల్పించడం లేదు. ఈ పథకం గురించి తెలియక నిరుపేద గిరిజనులు దరఖాస్తు చేసుకోలేకపోయారు.

పథకం గురించి తెలియదు



మా భూములలో గవర్నమెంట్ బోర్లు వేయిస్తుందనే సంగతి మాకు తెలియదు. అధికారులు ఎవరూ వచ్చి తండాల్లో ఈ విషయం చెప్పలేదు. ఎన్నో ఏళ్లుగా సాగునీరు లేక భూములన్నీ పడావుగా ఉన్నాయి.

– భూక్య ఈరవ్వ, రాజన్నపేట

అవగాహన కల్పించాలి



గిరివికాస పథకం గురించి గిరిజనులకు తెలియదు. 2018లో పథకం ప్రవేశపెడితే ఇప్పటి వరకు ఒకే ఒక్క యూనిట్ మంజూరు చేయడం బాధాకరం. పేద గిరిజనులు ఆర్థిక స్థోమత లేక సొంతంగా బోర్లు వేసుకోలేకపోతున్నారు. భూములు బీడుగా ఉంటున్నాయి. – రాజునాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు

సర్వేలు చేస్తాం

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న చోట్ల సర్వేలు చేస్తున్నాం. అర్హులను గుర్తించి ఈ పథకాన్ని అమలు చేస్తాం. పూర్తిస్థాయిలో అవగాహన లేని కారణంగానే గిరిజనులు పథకాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించి అర్హులకు వర్తింపజేస్తాం.

– గంగారం, ఉమ్మడి జిల్లా సంక్షేమాధికారి

నేడు జిల్లాకు రేవంత్‌రెడ్డి రాక

- జిల్లాలో రెండు రోజుల పాదయాత్ర



రేవంత్‌రెడ్డి

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి చేరుకుంటారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ గురువారం తెలిపారు. హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి రెండు రోజులు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పాదయాత్ర చేసి ప్రజాసమస్యల తెలుసుకుంటారని వివరించారు. శుక్రవారం రాత్రి తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో బసచేస్తారని, శనివారం ఉదయం గంభీరావుపేట మండలం సింగసముద్రం వద్ద కాళేశ్వరం 9వ ప్యాకేజీ పెండింగ్ పనులు పరిశీలిస్తారని ఆది శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో నేతకార్మికులు, ఆసాములతో మాట్లాడుతారని, శనివారం సాయంత్రం నేతన్నచౌక్‌లో మాట్లాడుతారని వివరించారు. అనంతరం వేములవాడ మండలం రుద్రవరంలో బసచేస్తారని, మార్చి 5వ తేదీ ఆదివారం ఉదయం వేములవాడ రాజన్నను దర్శించుకుని, కథలాపూర్ మండలం కలికోట సూరమ్మ చెరువును పరిశీలిస్తారని శ్రీనివాస్ పేర్కొన్నారు. కొడిమ్యాల మండలం పూడూరులో బస చేస్తారని వివరించారు.



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

పాదయాత్రను విజయవంతం చేయండి

వేములవాడఅర్బన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ మండలం రుద్రవరంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర శనివారం రుద్రవరం. సంకెపల్లి గ్రామాల నుంచి ప్రారంభమై అనుపురం, నాంపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా మీదుగా తిప్పాపూర్ నుంచి వేములవాడ రాజన్న గుడి వరకు చేరుకుంటుందని తెలిపారు. ఈ పాదయాత్రకు భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, రగుడు పర్శరాములు తదితరులు ఉన్నారు.

'చెత్త' పనికి షాప్ సీజ్



రోడ్డుపై పడేసిన చెత్తను శుభ్రం చేస్తున్న బల్దియా సిబ్బంది



షాప్ సీజ్‌చేస్తున్న బల్దియా సిబ్బంది

- రోడ్డుపై చెత్తపడేసిన వ్యాపారి
- సదరు వ్యాపారిపై కొరడా ఝుళిపించిన బల్దియా
- రూ.8వేలు జరిమానా

సిరిసిల్లటౌన్: చెత్తరోడ్డుపై పడేయొద్దు.. మున్సిపల్ వాహనానికి అప్పగించాలి.. లేదంటే కఠిన చర్యలు ఉంటాయన్న సిరిసిల్ల బల్దియా ప్రకటనను ఓవ్యాపారి పెడచెవిన పెట్టాడు. పర్యవసానంగా ఏకంగా రూ.8వేలు జరిమానా చెల్లించిన సంఘటన గురువారం సిరిసిల్ల పట్టణంలో చర్చనీయమైంది. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన మెహెర్‌కృప కిరాణం షాపులో నుంచి పనికిరాని చెత్తను సదరు షాపు యజమాని ఎవరికీ తెలువకుండా మార్కెట్ ఏరియాలోని రోడ్డుపై పడేసి వెళ్లాడు. రోడ్డంతా చెత్తమయం కావడంతో స్థానికుల నుంచి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు అందింది. రోడ్డుపై పడేసిన చెత్తలో షాపునకు సంబంధించిన బిల్లులను మున్సిపల్ సిబ్బంది గుర్తించి దుకాణాన్ని సీజ్ వేశారు. విషయం తెలుసుకుని సదరు వ్యాపారి బల్దియా కార్యాలయానికి వెళ్లి తప్పును ఒప్పుకోవడంతో రూ.8వేలు జరిమానా విధించినట్లు కమిషనర్ వివరించారు.

యువరైతు ఉపాయం.. పంటకు అభయం



పొలంలో ఏర్పాటు చేసిన బొమ్మ

సిరిసిల్లఅర్బన్: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే చేతికొచ్చే సమయంలో చీడపురుగులు, ఎలుకలు, అడవిపందులు దాడి చేసి రైతులను నిలువున ముంచేస్తున్నాయి. ఏటా పంటపై జరుగుతున్న అడవి జంతువుల దాడులతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని రగుడుకు చెందిన ఎలుక తిరుపతి వినూత్నంగా ఆలోచించాడు. పంట పొలంలో షాపింగ్‌మాల్స్‌లో ఏర్పాటు చేసే బొమ్మలు(మానెక్విన్) ఏర్పాటు చేశాడు. ఆ బొమ్మలు అచ్చం మనుషులను పోలి ఉండడంతో అడవిపందులు, కోతులు వాటిని చూసి బెదిరిపోతున్నాయని యువరైతు తెలిపాడు. అంతకుముందు రాత్రి వేళ అడవిపందులు పొలాల్లోకి వచ్చేవని.. ఇప్పుడు రావడం లేదని సంతోషం వ్యక్తం చేశాడు.

హింసకు గురైతే సమాచారం ఇవ్వండి

- డీడబ్ల్యూవో లక్ష్మీరాజం



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

సిరిసిల్లకల్చరల్: మహిళలు ఎలాంటి హింసకు గురైన వెంటనే సమాచారం ఇవ్వాలని జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్ రోడ్డులోని అంబేద్కర్ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం మాట్లాడుతూ స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావిస్తూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ చర్యలను వివరించారు. శారీరక, మానసిక, గృహహింసలకు గురవుతున్న బాలబాలికలు, వయోవృద్ధులు, మహిళల గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సఖీ అడ్మినిస్ట్రేటర్ బోనాల రోజా మాట్లాడుతూ సమాజంలో సామాజిక మాధ్యమాల ద్వారా మహిళలు మోసపోతున్నారని, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల హెల్ప్‌లైన్ నంబర్, 1098, వయోవృద్ధుల కోసం 14567, మహిళా హెల్ప్‌లైన్ 181, దివ్యాంగుల కోసం 155326 హెల్ప్‌లైన్ నంబర్లు నిరంతరం పనిచేస్తాయన్నారు. సదస్సులో సఖీ కేంద్రం కౌన్సిలర్, దేవిక, అంజలి, ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్మెత్తిపోస్తున్న రోడ్లు !



పాపన్నచౌక్ నుంచి తెలంగాణ చౌక్ వరకు ప్రధాన రహదారిపై పేరుకుపోయిన దుమ్ము

- జాతర పనుల్లో నిర్లక్ష్య ఫలితం
- వేములవాడలో రోడ్లపై దుమ్ము, దూళి
- అనారోగ్యంబారిన వ్యాపారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

వేములవాడ: ఆధ్యాత్మిక కేంద్రం వేములవాడ మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులు దుమ్మెత్తిపోస్తున్నాయి. పెరిగిన వాహనాల రద్దీకితోడు రోడ్లపై దుమ్ము, దూళి పేరుకుపోతుండడం ప్రధాన సమస్యగా మారింది. ఇటీవల వేములవాడలో అంగరంగ వైభవంగా జరిగిన మహాశివరాత్రి జాతరకు రాజన్న ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. వందలాది మంది పారిశుధ్య కార్మికులు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసినప్పటికీ రోడ్లపై దుమ్ము మాత్రం అలాగే పేరుకుపోయింది. వాహనాల వేగానికి ఆ దుమ్ము లేచి రోడ్లపక్కనే ఉన్న దుకాణాల్లో చేరుతుంది.

జనసమ్మర్థ ప్రాంతం

పాపన్నచౌక్ నుంచి తెలంగాణచౌక్ వరకు వేములవాడలోనే ప్రధాన వ్యాపారకేంద్రం. ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా వివిధ వ్యాపారాలు నిర్వహించే దుకాణాలు దాదాపు 100 వరకు ఉంటాయి. ఒక్కో దుకాణంలో ఇద్దరు చొప్పున యజమానులు లేదా సిబ్బంది పనిచేస్తుంటారు. ఆయా దుకాణాలకు నిత్యం దాదాపు 2వేల మంది వినియోగదారులు వచ్చిపోతుంటారు. వీరితోపాటు ఆ ప్రాంతంలో నిత్యం విద్యార్థులు, చుట్టుపక్కల గ్రామీణులు దాదాపు 5 వేల మంది వరకు సంచరిస్తూ ఉంటారు.

రోజులకొద్దీ తగ్గని దగ్గు

ఈ ప్రాంతంలోని వ్యాపారుల్లో చాలా మంది ఇటీవల దగ్గు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రుల్లో చూపించుకున్నప్పటికీ రోజులకొద్దీ సమస్య తీరడం లేదు.



- ఈ చిత్రంలో కనిపిస్తుంది కర్రీపాయింట్ నిర్వాహకుడు వెంకటేశ్. కొన్నేళ్లుగా సెస్ ఆఫీస్ ఎదురుగా కర్రీ పాయింట్ పెట్టుకుని జీవిస్తున్నాడు. రోడ్డపై నుంచి వస్తున్న దుమ్ముతో ఇబ్బందిపడుతున్నాడు. ఎన్నిసార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయాడు.



- ఈ చిత్రంలో కనిపిస్తుంది నరెడ్ల కృష్ణారెడ్డి. కలర్ పేయింట్స్ షాపు నడిపిస్తున్నాడు. నెల రోజులుగా దుకాణంలోకి రోడ్డుపై నుంచి దుమ్ము, దూళి విపరీతంగా వస్తుంది. ఈ దుమ్ము దుకణం మొత్తం వ్యాపిస్తుండడంతో కృష్ణారెడ్డి ఒక్కరే కాదు.. పాపన్నచౌక్ నుంచి తెలంగాణచౌక్ వరకు ఉన్న వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న మిట్టపల్లి శివ సెల్‌పాయింట్ నిర్వాహకుడు. రోడ్డుపై నుంచి వస్తున్న దుమ్మును భరించలేక షాపునకు గ్లాస్, ట్రాన్స్‌పరెంట్ కవర్ వేసుకున్నారు. వాహనాలు రద్దీ పెరగడంతో రోడ్డుపై పేరుకుపోయిన దుమ్ము లేచి డైరెక్ట్‌గా దుకాణంలో చేరుతంది. పరిస్థితి ఇలాగే ఉంటే తమ ఆరోగ్యాలు దెబ్బతింటాయని వ్యాపారులు భయపడిపోతున్నారు.

ప్రధాన రోడ్లను శుభ్రం చేస్తాం



మహాశివరాత్రి జాతర సందర్భంగా జాతరగ్రౌండ్ ప్రాంతాల్లో దృష్టి సారించాం. ప్రస్తుతం ప్రధాన రహదారులను శుభ్రం చేయిస్తాం. ప్రధాన రోడ్లపై దుమ్మును పూర్తిగా తొలగించేందుకు పారిశుధ్య సిబ్బందికి ఆదేశిస్తాను.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్

గ్యాస్ భారంపై నిరసనలు



సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌక్‌లో వంటావార్పుతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వంటగ్యాస్ ధర పెంపుపై బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. అంబేద్కర్‌చౌరస్తా, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కట్టెల పొయ్యిపై వంటావార్పుతో నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ 2014లో రూ.410 ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు రూ.1155కు చేరిందన్నారు. ప్రజలపై భారం మోపడం సమంజసం కాదన్నారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, నాయకులు బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాణి, అనసూయ, సీపీఎం నాయకులు మూశం రమేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘కృష్ణవేణి’లో అవర్ హెల్పర్స్ యాక్టివిటీ



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సిరిసిల్లటౌన్ : పట్టణంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో అవర్ హెల్పర్స్ యాక్టివిటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సమాజంలో ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజినీర్లు, తదితర వృత్తుల్లో పనిచేసే వారి సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలోని నర్సరీ, యూకేజీ విద్యార్థులు పలు రకాల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలప పట్టివేత



పట్టుబడ్డ టేకు దుంగలు

చందుర్తి (వేములవాడ): చందుర్తి మండల కేంద్రం శివారులోని అటవీప్రాంతంలో నిల్వ ఉన్న అక్రమ కలపను అటవీ అధికారులు గురువారం పట్టుకున్నారు. చందుర్తి శివారు అటవీ ప్రాంతంలోని గండి మైసమ్మ ఆలయ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు కలపను భద్రపరిచారన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆ ప్రాంతంలో గాలించారు. ఈక్రమంలో రూ.30వేల విలువ చేసే పది టేకు దుంగలు దొరికాయి. వారం రోజులుగా చందుర్తి అటవీ ప్రాంతంలో కలప స్మగ్లర్లు విలువైన టేకు చెట్లను నరికి వేసి సొమ్ము చేసుకుంటున్నట్లు చర్చ సాగుతోంది. ఫారెస్టు అధికారులు నిరంతరం నిఘాను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

కుక్కల దాడిలో ఐదు మేకలు మృతి



మృతి చెందిన మేకలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌తండాలో మాజీ సర్పంచ్ భూక అమున సీత్యానాయక్‌కు చెందిన మేకల మందపై గురువారం కుక్కలు దాడిచేశాయి. జీవనోపాధి కోసం మాజీ సర్పంచ్ కేడీసీసీ బ్యాంక్‌లో రూ.4లక్షల అప్పు చేసి మేకలను పెంచుతున్నారు. ఇంటి బయట ఉన్న మేకలపై పది కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయన్నారు. కుక్కల దాడిలో ఐదు మేకలు మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయి. దాదాపు రూ.80వేల వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన బాధిత మాజీ సర్పంచ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం కుక్కల దాడిలో ఒకరు గాయపడ్డారు. గుండెల్లి కిష్టయ్యగౌడ్ బజారుకు వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయి. గాయపడ్డ కిష్టయ్యను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు.

మద్యం దుకాణంలో చోరీ

తంగళ్లపల్లి : మండలంలోని సారంపల్లి గ్రామ శివారులో గల మద్యం దుకాణంలో బుధవార రాత్రి చోరీ జరిగింది. ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లిన సిబ్బంది చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కౌంటర్‌లో నుంచి రూ.30 వేలు నగదుతోపాటు మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సుకన్య ఖాతాల్లో టాప్

- కరీంనగర్ పోస్టల్ డివిజన్‌కు రాష్ట్రంలో మొదటి స్థానం
- టార్గెట్ కన్నా 168 శాతం అధిక పాలసీల సేకరణ
- లక్ష్యకు చేరువలో ఎస్ఎస్‌వై పాలసీలు

కరీంనగర్ డివిజన్ పోస్టల్

హెడ్ పోస్టాఫీసులు	2 (కరీంనగర్, జగిత్యాల)
సబ్ పోస్టాఫీసులు	52
బ్రాంచ్ పోస్టాఫీసులు	389



బోయినపల్లిలో సుకన్య ఖాతా తెరుస్తున్న వ్యక్తి

బోయినపల్లి(చొప్పదండి): సుకన్యా సమృద్ధి యోజన(ఎస్ఎస్‌వై) పథకం ఖాతాలు తెరవడంలో కరీంనగర్ పోస్టల్ డివిజన్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఆడపిల్లలు ఉన్న ఇళ్లల్లో ఎస్ఎస్‌వై ఖాతా తెరవాలనే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో అమ్రిత్‌పెక్స్–2023 పేరుతో తపాలా శాఖ ఇటీవల ప్రత్యేక మేళా నిర్వహించింది. కరీంనగర్ పోస్టల్ డివిజన్‌లో 3,726 సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిచి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందింది. లక్ష్యాన్ని మించి 168 శాతం ఎక్కువగా సుకన్య ఖాతాలు తెరిచారు. ఈమేరకు డివిజన్ పోస్టల్ ఉద్యోగులను రాష్ట్ర డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్ వారికి ప్రత్యేక ప్రశంసాపత్రం అందించారు. ప్రధాని నరేంద్రమోదీ బేటీ బచావో.. బేటీ పడావో.. నినాదంతో ఆడ శిశువుల సంరక్షణ కోసం 2015 జనవరి 22వ తేదీన సుకన్యా సమృద్ధి యోజన పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే..

లక్షకు చేరువలో ఎస్ఎస్‌వై పాలసీలు

కరీంనగర్ పోస్టల్ డివిజన్‌లో గత ఫిబ్రవరి నెలాఖరు వరకు 93,943 సుకన్య సమృద్ధి యోజన పాలసీలను డివిజన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో తెరిచారు. ఉమ్మడి కరీంనగర్ డివిజన్ పోస్టల్ ఎస్పీ వై.వెంకటేశ్వర్లు నేతృత్వంలో సిబ్బంది చురుకుగా పనిచేసి లక్ష్యాన్ని దాటిపోయారు. ఖాతా మొదలు చేసిన సమయంలో కనీస రుసుం రూ.250 ఉంటుంది. తరువాత ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.50 లక్షలు వరకు చెల్లించే అవకాశం ఉంది. ఎస్ఎస్‌వై ఖాతాకు ప్రస్తుతం 7.6 శాతం వడ్డీ జమచేస్తున్నారు. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీ రేటును భారత ప్రభుత్వం సమీక్షించి మారుస్తుంది. ఒక వేళ ఏ కారణం చేతనైనా ఖాతాకు సంబంధించిన నగదు చెల్లించకపోతే ప్రతీ ఆర్థిక సంవత్సరానికి కనీస నగదు రూ.250తోపాటు రూ.50 జరిమానా విధిస్తారు.

స్పెషల్ డ్రైవ్‌లో భారీగా పాలసీలు



సుకన్య సమృద్ధి యోజన పథకం స్పెషల్ డ్రైవ్‌ను పెద్ద ఎత్తున చేపట్టాం. బోయినపల్లి ఎస్‌వో పరిధిలో బీవో గ్రామాల్లో ఇప్పటి వరకు సుమారు 1,600 వరకు ఖాతాలు తెరిచాము. ఇంకా ఎస్ఎస్‌వై ఖాతాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము.

– ఎంవీ స్వామి, సబ్‌పోస్టు మాస్టర్, బోయినపల్లి

ప్రజల నుంచి స్పందన



పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో గత నెలలో చేపట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రత్యేక డ్రైవ్‌లో ఆడ పిల్లల తల్లిదండ్రుల నుంచి భారీ స్పందన వచ్చింది. కరీంనగర్ నార్త్ డివిజన్ పరిధిలోని శాఖ తపాలా కార్యాలయాల్లో పెద్ద ఎత్తున పాలసీలు సేకరించాం.

– చంద్రమోహన్, పోస్టల్ ఐపీవో,

రాష్ట్ర స్థాయిలో గుర్తింపు



అమృత్ పెక్స్–2023 స్పెషల్ డ్రైవ్‌లో రాష్ట్రంలోని అన్ని పోస్టల్ సర్కిళ్లను అధిగమించి కరీంనగర్ డివిజన్ నెలలోనే 3,726 ఎస్ఎస్‌వై పాలసీలను సేకరించింది.డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ కేపీ దేవరాజ్ కరీంనగర్ డివిజన్ పోస్టల్ సిబ్బందిని అభినందించారు. ఈ ఘనతలో డివిజన్‌లోని ప్రతీ పోస్టల్ ఉద్యోగి సమష్టి కృషి, పట్టుదల ఉంది.

– వై.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, కరీంనగర్ డివిజన్

గ్రామీణుల కోసమే ఉచిత వైద్య శిబిరాలు

- గ్రామీణుల కోసమే ఉచిత వైద్య శిబిరాలు
- చల్మెడ ఆస్పత్రి ఛైర్మన్ లక్ష్మీనర్సింహారావు



శిబిరంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీ నర్సింహారావు

కోనరావుపేట : గ్రామీణుల కోసమే చల్మెడ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ చల్మెడ లక్ష్మీ నర్సింహారావు తెలిపారు. చల్మెడ ఆస్పత్రి సౌజన్యంతో మండలంలోని మల్కపేటలో గురువారం ఇంటింటా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరాల్లో అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సర్పంచ్ ఆరె లత, ఉపసర్పంచ్ జవ్వాజి అంజయ్య, ఆస్పత్రి ఇన్‌చార్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

‘నాకే నోటీస్ ఇస్తావా?’

- ఉద్యోగానికే రాజీనామా చేస్తా
- హాట్ టాపిక్‌గా మారిన ఉద్యోగి నిర్వాకం

వేములవాడరూరల్: కార్యాలయానికి సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని ఆ కార్యాలయ అధికారి సదరు ఉద్యోగికి నోటీసు ఇచ్చాడు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై మండిపడిన సదరు ఉద్యోగి ‘నాపైనే ఫిర్యాదు చేస్తావా..’ అంటూ ఇక నేను ఉద్యోగమే చేయనని, వాట్సాప్ గ్రూప్‌లో రాత్రి సమయంలో రాజీనామా పంపించడం తోటి ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. నాలుగు రోజుల క్రితం వేములవాడ మండల పరిషత్‌లో విధులు నిర్వహించే ఓ ఉద్యోగికి నోటీస్ ఇవ్వగా ఈ తతంగం జరిగినట్లు తెలిసింది. ఉన్నతాధికారి ఇచ్చి నోటీస్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజీనామా చేస్తానని రాత్రి వాట్సాప్‌లో పోస్టు పెట్టాడు. మరుసటిరోజు ఉదయం పొరపాటున పోస్టు చేశారని సదరు ఉద్యోగి ఉన్నతాధికారిని వేడుకున్నట్లు తెలిసింది. ఈ విషయం మండలంలో చర్చనీయాంశమైంది.

బీడీ కార్మికుల సమస్యలపై పోరాడుతాం

- ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు రాములు



మాట్లాడుతున్న రాములు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): బీడీ కార్మికుల సమస్యలు, హక్కులపై పోరాడుతామని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాములు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఐఎఫ్టీయూ, బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లాస్థాయి ప్రథమ మహాసభలను నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఆకుల రాములు, ఉపాధ్యక్షుడిగా పర్శరాములు, ప్రధాన కార్యదర్శిగా వేముల పర్శరాములు, సహాయ కార్యదర్శిగా తుడుం శ్రీకాంత్, కోశాధికారిగా ఎడవెల్లి దేవయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా మందాటి మణెవ్వ, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వేముల పర్శరాములు, సహాయ కార్యదర్శిగా వాసవి రాజవ్వ, కోశాధికారిగా ముగ్గు లక్ష్మితో పాటు ముగ్గురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భూమయ్య, రాష్ట్ర అధ్యక్షుడు చింత భూమేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి!



బాలింత సుమంగళి



చనిపోయిన శిశువు

- ఆపరేషన్ ఆలస్యమే ప్రాణం తీసిందన్న బంధువులు
- పాపకు హార్ట్‌బీట్ తక్కువుండటమే కారణమంటున్న వైద్యులు
- మూడు రోజుల క్రితమే దవాఖానాలో చేరిన గర్భిణి
- నార్మల్ డెలివరీ కోసం వేచిచూసిన వైనం
- విచారణ జరిపిస్తాం : డీసీహెచ్ శ్రీధర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన కలువల సుమంగళి అనే గర్భిణి గత నెల 28న స్థానిక ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో చేరింది. గురువారం ఆపరేషన్ చేయగా పాప జన్మించింది. కాసేపటికే హార్ట్‌బీట్ లేకపోవడంతో కుటుంబసభ్యులు వైద్యులకు సమాచారం అందించారు. పిల్లల డాక్టర్ పరిశీలించి, మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో బాధితులతోపాటు వారి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్సై ఉపేందర్‌రావు దవాఖానాకు చేరుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పాప చనిపోయిందని బాధితులు ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీహెచ్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. మూడు రోజులు సాధారణ ప్రసవం కోసం వేచిచూశారని, ముందే ఆపరేషన్ చేసి ఉంటే పాప బతికేదని సుమంగళి సోదరుడు సురేష్ తెలిపాడు. ఆస్పత్రిలో మందులు లేవంటే బయట కొనుగోలు చేశామని పేర్కొన్నాడు. డ్యూటీలో ఉన్న నర్సుల ప్రవర్తన బాగాలేదని, విధులు నిర్వహించే డాక్టర్ స్థానికంగా ఉండకపోవడం, సకాలంలో ప్రసవం చేయకపోవడం వల్లే శిశువు చనిపోయిందని ఆరోపించాడు.

చెప్పినా వారు వినలేదు : వైద్యురాలు

పాప కుటుంబసభ్యుల అంగీకారం మేరకే ప్రసవం చేసినట్లు వైద్యురాలు రమాదేవి తెలిపారు. హార్ట్‌బీట్ తక్కువగా ఉందని కరీంనగర్ లేదంటే పెద్దపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పినప్పటికీ వారు వినలేదన్నారు. బాధితుల నుంచి వివరాలు తీసుకున్నామని డీసీహెచ్ తెలిపారు. కమిటీ వేసి, విచారణ జరిపి, న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- వివాహేతర సంబంధమే హత్యకు దారితీసిందని అనుమానం



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సై లక్ష్మారెడ్డి



రౌడీ షీటర్ కొమిరే వాసు(ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ గ్రామపంచాయతీ పరిధిలో రౌడీషీటర్ కొమిరె వాసు(40) దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన కొమిరె వాసు ఒక హత్యతోపాటు పలు కేసుల్లో నిందితుడుగా ఉండడంతో రౌడీషీట్ తెరిచారు. వాసుకు పలువురు మహిళలతో అక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఓ ఫంక్షన్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకెళ్లిన వాసు తిరిగి ఇంటికి రాలేదు. గ్రామంలోని సారంపల్లి శివారు పెద్దమ్మ ఆలయం సమీపంలోని కొమురయ్యకుంట వద్ద చనిపోయి ఉన్నాడని సమాచారం అందింది. కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించి, వాసు హత్యకు గురయ్యాడని గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో సిరిసిల్లరూరల్ సీఐ బి.ఉపేందర్, తంగళ్లపల్లి ఎస్సై పి.లక్ష్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని హత్యగా నిర్ధారించి దర్యాప్తు ప్రారంభించారు. వేరే చోట హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించేందుకు శవాన్ని గ్రామశివారుకు తరలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని బైక్‌పై తరలిస్తున్న క్రమంలో రెండు కాళ్లు రోడ్డుకు రాసుకుని గాయాలైనట్లు చర్చించుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఒక మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న క్రమంలో సదరు మహిళ చిన్నకూతురిపై వాసు కన్నేయడంతోనే ఆమె వాసును హత్య చేయించినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. గతంలో సదరు మహిళ పెద్ద కూతురిపై అసభ్యంగా ప్రవర్తించిన విషయం ఠాణా వరకు వెళ్లింది. మృతుడికి భార్య నిర్మల, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తన భర్త హత్యకు గ్రామంలోని ఓ మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ కొమిరె నిర్మల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని సిరిసిల్లరూరల్ సీఐ బి.ఉపేందర్ తెలిపారు. కాగా ఇప్పటికే హత్యకు కారణమైన మహిళతోపాటు పలువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వారిని శుక్రవారం లేదా శనివారం అరెస్టు చూపనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

విద్యార్థినులకు సామగ్రి పంపిణీ



తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ప్రభుత్వం పంపిణీ చేసిన సామగ్రిని ఎంపీటీసీ కోడి అంతయ్య గురువారం విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసిందు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఫ్లెక్సీపై మోదీ, సోనియాగాంధీ ఫొటోలు !



గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసనలో వింత చోటుచేసుకుంది. నిరసనలో ప్రదర్శించిన ఓ ఫ్లెక్సీలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రంతోపాటు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చిత్రాన్ని ఏర్పాటు చేశారు. పొరపాటు గ్రహించిన నేతలు ఆ స్థానంలో ఇతర పేపర్లు అతికించి సోనియాగంధీ ఫొటో కనిపించకుండా కవర్ చేవారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

గంజాయి విక్రేత అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: అడ్డదారిలో డబ్బు సులువుగా సంపాదించాలని గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీపీ ఎల్.సుబ్బారాయుడు కమిషనరేట్ కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన గండికోట దేవరాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. స్వగ్రామంలో ఉపాధి లేక కుటుంబాన్ని పోషించుకోవడానికి పదేళ్ల సౌదీ అరేబియాలో డ్రైవర్‌గా పని చేశాడు. ఆ సంపాదన సరిపోక తిరిగి వచ్చాడు. పెట్టుబడి లేకుండా సులువుగా డబ్బు సంపాదించాలంటే ఏం చేయాలని ఆలోచించాడు. గతంలో కొంత కాలం ఒడిశా రాష్ట్ర సరిహద్దులో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాడు. అక్కడ గంజాయి సాగు, విక్రయాలపై ఉన్న అవగాహనతో ఈ పనే చేయాలని నిర్ణయించుకున్నాడు. కరీంనగర్ జిల్లాలోనూ గంజాయి విక్రయించడం మొదలు పెట్టాడు. అతని కదలికలపై త్రీటౌన్ పోలీసులు నిఘా పెట్టారు. ఇంటి నుంచి తరచూ బైక్‌పై వెళ్లి, రెండు రోజుల తర్వాత వస్తున్నట్లు గుర్తించారు. దేవరాజు ఒడిశా సరిహద్దులోకి వెళ్లి, గంజాయి ప్యాకెట్లు తెచ్చి, ఇక్కడ విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో గురువారం గంజాయి తీసుకువస్తుండగా పోలీసులు కరీంనగర్‌లో పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.లక్ష విలువైన 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దేవరాజును పట్టుకున్న త్రీటౌన్ సీఐ పి.దామోదర్‌రెడ్డి, ఎస్ఐ పి.శ్రీనివాసరావు, సిబ్బంది కృష్ణ, విజయ్, మనోహర్, లక్ష్మీనర్సయ్య, వి.దామోదర్‌లను సీపీ అభినందించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

రామడుగు(చొప్పదండి): మండలంలోని చిప్పకుర్తి గ్రామానికి చెందిన బుర్ర వీరయ్యగౌడ్(76) అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి, మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. వీరయ్యగౌడ్ గురువారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను గ్రామస్తులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

దివ్యాంగ కూతురిని కాలువలో పడేసిన తండ్రి?

- భార్యతో గొడవపడటమే కారణం
- చిన్నారి ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

తిమ్మాపూర్(మానకొండూర్): కుటుంబ కలహాల కారణంగా దివ్యాంగురాలైన తన కూతురిని కాలువలో పడేసినట్లు ఓ వ్యక్తి తెలిపాడు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన మహేందర్ బుధవారం రాత్రి తన భార్యతో గొడవపడ్డాడు. తర్వాత ఆవేశంలో దివ్యాంగురాలైన తన ఆరేళ్ల కూతురు దుర్గాభవానిని తీసుకొని బయటకు వెళ్లిపోయాడు. పాపను తిమ్మాపూర్ మండలంలోని అల్గునూర్ శివారు కాకతీయ కాలువలో పడేసి, ఇంటికి వెళ్లాడు. కుటుంబసభ్యులు దుర్గాభవాని గురించి ఆరా తీయగా కాలువలో పడేసినట్లు చెప్పాడు. దీంతో గురువారం ఉదయం కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఏసీపీ కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో తిమ్మాపూర్ సర్కిల్ పోలీసులు కాలువ నీటిని నిలిపివేయించి, పాప కోసం గాలిస్తున్నారు. సాయంత్రం వరకూ ఆచూకీ లభించలేదు. అయితే మహేందర్‌కు మతిస్థిమితం సరిగా ఉండదని, అతను నిజంగా పాపను కాలువలో పడేశాడా అని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

- గత నెల 24న వెంకటాయిపల్లిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- మృతుడి తమిళనాడు వాసి

గంగాధర(చొప్పదండి): బోర్‌వెల్ లారీ డ్రైవర్ ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతి చెందాడు. గంగాధర ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా ఇడుపుడి తాలుకా అక్కలైపట్టి గ్రామానికి చెందిన ఇళయరాజా అదే రాష్ట్రానికి చెందిన జయకుమార్ వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 24న గంగాధర మండలంలోని వెంకటాయిపల్లిలో ఓ రైతు వ్యవసాయ బావిలో సైడ్ బోర్లు వేశారు. రాత్రి కావడంతో కూలీలందరూ అక్కడే నిద్రించారు. మరుసటి రోజు ఉదయం ఇళయరాజా కనిపించలేదు. గతంలో అతను ఎవరికీ చెప్పకుండానే ఇంటికి వెళ్లిపోయేవాడు. దీంతో వారు అలాగే వెళ్లిపోయాడేమో అనుకున్నారు. ఈ క్రమంలో ఇళయరాజా ఇంటికి రాలేదని బుధవారం సమాచారం రావడంతో చివరిగా పనిచేసిన వెంకటాయిపల్లి గ్రామంలోని బావిలో చూడగా మృతదేహం కనిపించింది. గురువారం బయటకు తీయగా ఇళయరాజాగా గుర్తించారు. లారీ యజమాని జయకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.